అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- మునుగోడు ప్రాజెక్ట్ పరిధిలో అద్దె భవనాల్లో 55 కేంద్రాలు
- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, చిన్నారులు

మునుగోడు : అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చడంలో అధికారులు విఫలమవుతున్నారు. అద్దె భవనాల్లో కేంద్రాలు నిర్వహించాల్సి వస్తుండడంతో టీచర్లకు తిప్పలు తప్పడం లేదు. ఉన్నవాటిలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో పాటు అధికారుల పర్యవేక్షణ లోపంతో నిర్వహణ సక్రమంగా సాగడంలేదు. ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు ఈ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించేందుకు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ అందుకు అవసరమైన భవనాలు నిర్మించకపోవడంతో వాటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ఆ భవనాల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో కేంద్రాలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 30ఏళ్లుగా కొనసాగిస్తున్న కేంద్రాలకు ఇప్పటికీ పక్కా భవనాలు నిర్మించకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న 55కేంద్రాలు..

మునుగోడు ప్రాజెక్టు పరిధిలోని మునుగోడు, చండూరు, చిట్యాల మండలాల్లోని గ్రామాల్లో మొత్తం 169అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 149 ప్రధాన కేంద్రాలు ఉండగా 20మినీ కేంద్రాలు ఉన్నాయి. అయితే అందులో కేవలం 33కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన వాటిలో 81కేంద్రాలు మూతపడినా ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లల్లో కొనసాగిస్తున్నారు. 55కేంద్రాలకు ఎక్కడా సొంత భవనాలు లేకపోవడంతో వాటిని అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు.



మునుగోడులో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

వాటి అద్దె కూడా పట్టణ కేంద్రాలలో రూ.వేయి, గ్రామాల్లో రూ.750మాత్రమే చెల్లిస్తుండడంతో అన్ని వసతులు కలిగిన భవనాలు దొరకడం లేదు. ఇరుకుగా ఉండి, మరుగుదొడ్లు లేని భవనాలను ఇస్తున్నారని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు.

అద్దె, ఉచిత భవనాల్లో నెలకొన్న సమస్యలు..

మునుగోడు ప్రాజెక్టు పరిధిలో కొనసాగిస్తున్న అద్దె, ఉచిత భవనాల్లో ప్రధానంగా విద్యుత్ సౌకర్యం లేదు. మరి కొన్నింటికి మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో చిన్నారులు ఆరుబయటే మల, మూత్ర



ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో ఉన్న చిన్నారులు

విసర్జన చేయాల్సి వస్తుంది. అదేవిధంగా గదులు ఇరుకుగా ఉండడంతో ఒకే గదిలో 20నుంచి 30మంది చిన్నారులను కూర్చోబెట్టాల్సి వస్తుంది. పౌష్టికాహారం తీసుకునేందుకు గర్భిణులు, బాలింతలు వస్తే కనీసం కూర్చునేందుకు స్థలం కరవయ్యింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

అద్దె భవనంలో సౌకర్యాలు లేవు



సొంత భవనం లేకపోవడంతో కేంద్రాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నాం. పట్టణ కేంద్రం కావడంతో ప్రభుత్వం అందించే రూ.వేయి అద్దెకు అన్ని సౌకర్యాలు కలిగిన భవనం అద్దెకు ఇవ్వడం లేదు. దీంతో పాత భవనాన్ని తీసుకోవాల్సి వచ్చింది. అద్దె భవనంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. పక్కా భవనాలు నిర్మించాలి.

– పగిళ్ల పద్మ, అంగన్‌వాడీ టీచర్, మునుగోడు

ప్రతి కేంద్రానికి సొంత భవనం నిర్మించాలి



అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నాం. అందులో చిన్నారులకు ఎలాంటి సౌకర్యాలు లేవు. దీంతో ఆ కేంద్రాలకు వచ్చే వారంతా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలి.

– మిర్యాల వెంకన్న, సర్పంచ్, మునుగోడు

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

నకిరేకల్ : ప్రజలందరికీ మౌలిక సదుపాయాలు కల్పించాలనేదే కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని చీమలగడ్డలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఎస్సీ వైకుంఠధామానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రూ1.50 కోట్ల వ్యయంతో తిప్పర్తి రోడ్డులో అంబేద్కర్ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణికృష్ణమూర్తి, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేష్, మున్సిపల్ కమిషనర్ నల్లా బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహిందర్‌రెడ్డి, కౌన్సిలర్లు కొండ శ్రీను, పల్లె విజయ్, రాచకొండ సునీల్, నాయకులు మంగినపల్లి రాజు, మట్టిపల్లి వీరు, దైద పరమేషం, వంటిపాక సుందర్, యాతాకుల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వైకుంఠ రథం

మున్సిపాలిటీలోని అన్నివర్గాల ప్రజల సౌకర్యార్థం వైకుంఠ రథాన్ని ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మున్సిపాలిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. మున్సిపాలిటీ పాలకవర్గం తీర్మానం మేరకు రూ.17 లక్షలతో కొత్త వాహనాన్ని కొనుగోలు చేసి వైకుంఠ రథంగా తీర్చిదిద్దారు. నకిరేకల్ మున్సిపాలిటీలో సుమారు 40 వేల జనాభా ఉంది. పట్టణంలో మూడు వైకుంఠధామాలను ఏర్పాటు చేశారు. పట్టణంలో మొత్తం 20 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల్లోని కాలనీల్లో ప్రజలు ఎవరైనా మృతి చెందినట్లయితే వారిని అంత్యక్రియల కోసం శ్మశానవాటికకు తీసుకెళ్లాలంటే



నార్కట్‌పల్లి : సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ బండా, ఎమ్మెల్యే చిరుమర్తి

పాడెతో లేదా ట్రాక్టర్లపై రెండు కిలోమీటర్ల పైనే తీసుకెళ్లి దహన సంస్కారాలు చేస్తున్నారు. వైకుంఠ రథం అందుబాటులోకి రావడంతో అంత్యక్రియలకు తీసుకెళ్లడానికి ఇబ్బందులు తప్పనున్నాయి.

గ్రామాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

నార్కట్‌పల్లి : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. మండలంలోని ఏపీ లింగోటం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లకు ఆదివారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు త్వరలో హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, ఎంపీడీఓ యాదగిరి, సర్పంచ్ నూకల శంకర్, ఎంపీటీసీ బొక్క కనకమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, బైరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, బైరెడ్డి నర్సింహారెడ్డి, పనసం వెంకటయ్య, గందమల్ల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల సంబరాలు



నల్లగొండ : సంబరాలు చేసుకుంటున్న విద్యార్థి సంఘాల నాయకులు

నల్లగొండ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిలో విద్యార్థి సంఘాల ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయం సాధించడంపై ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హాషీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, బిట్టు, రేణుక, అశోక్, యువరాజ్, కళ్యాణ్, సంపత్, నందిని తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ భారీ మెజార్టీతో గెలుపొందడంపై ఆ సంఘం నాయకులు ఆదివారం మునుగోడులోని హాస్టల్ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, కమ్మంపాటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థినిని సన్మానిస్తున్న నేతాజీ నర్సింగ్ స్కూల్ కరస్పాండెంట్

నల్లగొండ : పట్టణంలోని మమత హైస్కూల్లో చదివిన 1995–96 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ రెస్టారెంట్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. జలసాధన సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, పాఠశాల కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు యానాల ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సలీం, బాలశౌరిరెడ్డి, పురుషోత్తం, రామ్మూర్తి, సరళ, మల్లేష్, భీష్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, గెట్టు గెదర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ సయ్యద్, గోలి సైదులు, కంది కపిల్ ప్రసాద్, చింతపల్లి లింగమయ్య, రామకృష్ణ తదితరులు ఉన్నారు. అదేవిధంగా పట్టణంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో నేతాజీ నర్సింగ్ స్కూల్ కరస్పాండెంట్ ఎర్ర మాధవ్ శోభన్ బాబు అధ్యక్షతన ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు. ఈ సందర్భంగా శోభన్‌బాబు మాట్లాడుతూ నేతాజీ నర్సింగ్ స్కూల్ 33 సంవత్సరాలుగా నల్లగొండ జిల్లాలో ఎంతోమంది ఏఎన్‌ఎంలు, పారామెడికల్ విద్యార్థులను తీర్చిదిద్దినట్లు తెలిపారు. సుమారు 650 మంది వరకు విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగం పొంది వైద్య రంగంలో సేవలందిస్తున్నారని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు.



సమ్మేళనంలో పాల్గొన్న మమత స్కూల్ పూర్వ విద్యార్థులు

పేద బ్రాహ్మణుల ఇబ్బందులు తొలగించాలి

నల్లగొండ : పేద బ్రాహ్మణుల ఇబ్బందులు తొలగించాలని కోరుతూ అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ అపరకర్మలు నిర్వహించడానికి స్థలం కేటాయించాలని కోరారు. రంగరాజు శ్రీనివాసరావు, మారుతిశర్మ మోహన్, మణికంఠశర్మ, నవీన్ శర్మ, జయప్రద, లక్ష్మీకుమారి, భార్గవి, సరస్వతి, సుశీల, రఘువరన్, దారేపల్లి శ్రీదేవి, నాగమణి, సురేష్, వట్టిపల్లి రఘురాం శర్మ, భాగ్య, శ్రీనివాస్, ఇందిర, దరూడ్ శేషు, మూర్తి పాల్గొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ మొబైల్ ల్యాబ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

జిల్లా కేంద్రంలోని ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ మొబైల్ ఫుడ్ ల్యాబోరేటరీని స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. మొబైల్ ల్యాబ్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు పి స్వాతి, డాక్టర్ సుమన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లెం యాదగిరిరెడ్డి విగ్రహం ఆవిష్కరణ

మున్సిపాలిటీ పరిధి చర్లపల్లిలోని నేచర్ స్మార్ట్‌సిటీలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ పొలిట్‌బ్యూరో మాజీ సభ్యుడు క్లెం యాదగిరిరెడ్డి విగ్రహాన్ని ఆదివారం అడిషనల్ డీజీపీ బి.శివధర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. అదేవిధంగా కాలనీలో నూతనంగా నిర్మించిన అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లెం యాదగిరిరెడ్డి కుమారుడు క్లెం వేణుగోపాల్‌రెడ్డి,



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, సినీ నటుడు బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

కేవీఆర్ నల్లగొండ రాయల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం బహుమతులు అందజేశారు. విజేతగా నిలిచిన కేబీఆర్ రాయల్స్ టీమ్‌కు రూ.60 వేల నగదు, ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, ప్రదీప్‌నాయక్, కో ఆప్షన్ మెంబర్ జమాల్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని 37వ వార్డుకు చెందిన సోమ రామలింగం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం పరామర్శించి రామలింగం సతీమణి రాజేశ్వరికి రూ. 20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం నాయకుడు కొక్కు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా కరాటే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్



కరాటే టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : బాలికలు తప్పనిసరిగా కరాటే శిక్షణ తీసుకోవాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ స్పోర్ట్స్ కరాటే దో అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర 8వ షోటోఖాన్ కరాటే టోర్నమెంట్‌ను నకిరేకల్‌లోని సాయి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో 23 జిల్లాల నుంచి కరాటే శిక్షణ పొందిన 450 మంది బాలబాలికలు పాల్గొన్నారు. అండర్ -08, 10, 11, 16, 18, 21 విభాగాల్లో రెండు గ్రూపులు చొప్పున ఏర్పాటు చేశారు. అన్ని గ్రూపుల్లో విద్యార్థులకు చీఫ్ ఇన్ రాపోలు సుదర్శన్, డి.నర్సింహాచారి పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చినవారిని ఆయా కేటగిరిల్లో గ్రూపునకు రెండు జట్ల చొప్పున ఎంపిక చేశారు. వీరు త్వరలో జరగబోయే నేషనల్ లెవల్ కరాటే షోటోఖాన్ టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. ముగింపు కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకుడు దైద రవీందర్ హాజరై ప్రతిభ కనబర్చిన వారికి జ్ఞాపికలు, బెల్ట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేష్, వార్డు కౌన్సిలర్ కొండ శ్రీను, కరాటే టోర్నమెంట్ నిర్వాహకులు అంతటి సోములుగౌడ్, మాస్టార్లు, వంటిపాక శివ, రాచకొండ విజయ్, మధుబాబు, బాదిని సాయికుమార్, చెవుగోని శివరాం తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం విద్యార్థుల ప్రతిభ

శాలిగౌరారం : నకిరేకల్‌లో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో శాలిగౌరారంకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. శాలిగౌరారం నుంచి పాల్గొన్న ఏడుగురు విద్యార్థులు వివిధ విభాగాలలో మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులంతా మండలకేంద్రంలోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్య చదువుతున్నారు. పాఠశాలకు చెందిన కరాటే మాస్టర్ పి.అర్చన శిక్షణలో విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

చేనేత కార్మికులకు న్యాయం చేయాలి

చండూరు(గట్టుప్పల) : చేనేత కార్మికులకు న్యాయం చేయాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆనంద ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గట్టుప్పల మండల కేంద్రంలో జరిగిన చేనేత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించాలన్నారు. మార్చి 5 తేదీన హైదరాబాద్ పరిధిలోని ఆటోనగర్ కర్నాటి గార్డెన్‌లో చేనేత కార్మికులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై, చేనేత సంక్షేమ పథకాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నామని గోపాల్, ఇడెం కైలాసం, రాపోలు జగన్, శాంతికుమార్, గడ్డం వెంకటేశ్వర్లు, వడ్డెపల్లి పరమేశ్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ తేజస్వి

శాలిగౌరారం : వ్యవసాయ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తేజస్వి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆదివారం జరిగిన డైరెక్టర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సహకారంతో మార్కెట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.51.50 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మంజూరైన నిధులలో రూ.46 లక్షలతో కార్యాలయ భవనం, రూ.5.50 లక్షలతో రైతులకు మౌలిక వసతుల కల్పన, గోడౌన్ల పైకప్పుల రిపేరు, ధ్వంసమైన చోట ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుజిలాల్ శేఖర్‌బాబు, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్

శాలిగౌరారం : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అన్నారు. మండలంలోని తక్కెళ్ళపహాడ్, వల్లాల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గోదల ప్రభాకర్‌రెడ్డి, చిలుకూరి సైదమ్మ ఇటీవల మృతిచెందారు. ఒక్కో కుటుంబానికి పార్టీ బీమా పథకం నుంచి మంజూరైన రూ.2 లక్షల విలువ గల చెక్కులను ఆదివారం తిరుమలగిరిలోని ఆయన నివాసంలో అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, నరేందర్, నిమ్మల సత్యనారాయణ, బస్వరాజు పాల్గొన్నారు.

ఆలయ ఆర్చీకి శంకుస్థాపన

కట్టంగూర్ : మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయ ఆర్చీ నిర్మాణానికి ఆదివారం జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సహకారంతో రూ.4 లక్షలతో ఆర్చీ నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సింహ, చెవుగోని జనార్దన్, రెడ్డిపల్లి మనోహర్, ఉన్నారు.

1 నుంచి గిరిజన సంఘం మహాసభలు

చండూరు : మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు మిర్యాలగూడలో జరిగే గిరిజన సంఘం 3వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. ఆదివారం గట్టుప్పలలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కర్నాటి మల్లేశం, శివకుమార్, కక్కునూరి నగేష్, సబిత, అచ్చిన శ్రీనివాసులు, శేఖర్ పాల్గొన్నారు.

‘ఆయుష్మాన్ భారత్’పై అవగాహన

చిట్యాల : కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను ప్రతిఒక్కరూ పొందాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లపు బుద్ధుడు పేర్కొన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులపై ఆదివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు ద్వారా ఐదు లక్షల రూపాయల వరకు 1100 రకాల వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. బీజేపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాల లింగస్వామి, పాకాల దినేష్, పవన్, సుంకరి మల్లేష్, గంగాపురం వెంకన్న, మల్లేష్ , జగన్, రాంబాబు, లింగస్వామి, నర్సింహ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

కట్టంగూర్ : మండల కేంద్రానికి చెందిన చెవిగోని శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అతడితో కలిసి చదువుకున్న 2004–05 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం శంకర్ కుటుంబానికి రూ.83,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కొంక ప్రవీణ్‌కుమార్ స్నేహితులు కటికం వెంకటేశం, పోగుల మురళి, చెరుకు యాదగిరి, చింతల బాలనర్సింహ, పోగుల శ్రీను, బొడ్డుపల్లి శ్రీకాంత్, పాడిచేటి సురేష్, యర్కల వాసు, ఎం. పవన్, ముక్కాముల వెంకటేష్, వెంకటరమణ, రమేష్ ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడలో శ్రీ నీలకంఠ రామస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మార్చి 3న కల్యాణోత్సవం, 7న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సిరిప్రగడ ఆనందరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



నల్లగొండ పట్టణ శివారులోని రాంనగర్‌లో గల వైఎస్సార్ పార్క్‌లో ఆదివారం ఆర్యన్ యోగా సెంటర్‌కు చెందిన యోగా సాధన చేసే మహిళలు సందడి చేశారు. యోగా శిక్షకురాలు సంధ్య ఆధ్వర్యంలో మహిళలకు మ్యూజిక్ బాల్, వాటర్ గేమింగ్, కబడ్డీ, రన్నింగ్, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు

– కంది భజరంగ్ ప్రసాద్, సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నల్లగొండ

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి గంగాపురం అండాలుకు మంజూరైన రెండు లక్షల రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చిట్యాలలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తా యువసేన అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు పోలగోని స్వామి, మర్రి రమేష్, బీఆర్ఎస్ నాయకులు గుత్తా వెంకట్రాంరెడ్డి, తేరటుపల్లి హన్మంతు, గంగాపురం వెంకన్న పాల్గొన్నారు.

ఛాయాసోమేశ్వరాలయంలో విద్యార్థుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నల్లగొండ : సీబీఎస్‌సీ పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఛాయా సోమేశ్వరాలయంలో విపస్య పాఠశాల ప్రిన్సిపాల్ భరస్, విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి తిరుమలనాథ స్వామి కల్యాణోత్సవాలు

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో గల శ్రీ తిరుమలనాథస్వామి కల్యాణోత్సవాలను ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 28న ఫలహార బండ్లు, గణపతి పూజ, ధ్వజ గరుడ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మార్చి 1వ తేదీన శ్రీ భూసమేత తిరుమలనాథ స్వామి కల్యాణోత్సవం, అన్నదానం, మార్చి 2న స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ బాలగోని రాజుగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి పాలకవర్గ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కుక్కల దాడిలో నాలుగు మేకలు మృతి

చిట్యాల : మండలంలోని బోయగుబ్బ గ్రామంలో ఆదివారం మేకల మందపై కుక్కలు దాడిచేసిన ఘటనలో నాలుగు మేకలు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన చీర భిక్షంకు చెందిన మేకల మందపై అకస్మాత్తుగా కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో నాలుగు మేక పిల్లలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుడికు ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ కంచర్ల సునితవెంకట్‌రెడ్డి అధికారులను కోరారు.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి

కేతేపల్లి : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని నకిరేకల్ నియోజకవర్గ ఉద్యాన అధికారి రావుల విద్యాసాగర్ అన్నారు. సైన్స్ డే సందర్భంగా మండలంలోని బండపాలెం గ్రామంలో జ్ఞానాదర్శ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు ఆదివారం ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు, సైన్స్‌పై అవగాహన పెరిగేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విజ్ఞానాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు ప్రతి గ్రామంలో నిర్వహించేందుకు యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు కట్ట ప్రభాత్, సీహెచ్.నాగయ్య, సీహెచ్.అశోక్, జిల్లా దానేలు, పి.శ్రీను, రాజు, లోకేష్, లిఖిత, సాయి చరణ్, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న విద్యాసాగర్